


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### పెళ్ళివారమండీ...

**ఒకప్పుడు** పెళ్ళి వారం రోజులు చేసేవాళ్ళట. ఇప్పుడు పెళ్ళిళ్ళు వారం రోజులు నిలబడుతున్నాయి!

మా చిన్నతనంలో మా పెద్దక్క పెళ్ళికి నెల ముందునుండీ ఇంట్లో ఏవేం పనులు జరిగాయో నాకు తెలుసు! ముందుగా విఘ్నేశ్వరునికి బియ్యం కట్టారు.

అమ్మమ్మా ఇరుగూ పొరుగూ కలిసి వడియాలు పెట్టారు, అప్పడాలొత్తారు. ముత్యాల బియ్యం తెచ్చి బాగు చేసారు.

ఇంకా వారం రోజులుందనగా దగ్గర చుట్టాలందరూ వచ్చేసారు. ఇంటి ముందు పందిరి వేసారు. ఇంక అంతా ఆ పందిరి కిందే చేరారు. కబుర్లు, చిరుతిళ్ళు. కాలక్షేపానికి పాటలు, జంతికలు, చేగోడీలూ, అరిశెలూ, మినపసున్నీ కాకుండా ఇంటి ముందు నుండి వెళ్ళే ఐస్‌ఫ్రూట్లూ, జామకాయలూ, వేరుశనగ పప్పులూ ఏవీ వదిలేవాళ్ళంకాము పిల్లలం.

రాజమండ్రి నుండి వచ్చేవాళ్ళు విసినకర్రలు తెచ్చారు. నర్సాపురం నుండి వచ్చేవాళ్ళు కర్పూరం దండలు తెచ్చారు. ఇలా పెళ్ళికి అంతా తలొకటీ తెచ్చారు.

అమ్మమ్మ స్టోర్ రూం ఇన్ ఛార్జిగా సరోజిని అమ్మమ్మని పెట్టింది. ఈవిడ మా అమ్మమ్మకి తోడికోడలు. చాలా గట్టిమనిషి. ఎవరేం అడిగినా, అరిచి 'గీ' పెట్టినా వంద ప్రశ్నలు అడిగి కానీ ఇచ్చేది కాదు! సిగరెట్ కాల్చుకోడానికి అగ్గిపెట్టె ఈవిడ దగ్గర పుట్టించడం ఏ మగాడి తరం కాలేదు! ఇంక మా వంట బ్రాహ్మడు బంగారు పన్ను కృష్ణమూర్తికి అయితే... ఈవిడతో నిత్యం రగడ...రగడ!

బజారు పనులు అన్నింటికీ మా అన్నయ్య హనుమంతునీ, మురళినీ నియమించారు. దీంతో వీళ్ళు ఎవరొచ్చి ఇంటి ముందు సైకిల్ ఆపినా, వేసుకుని తుర్రుమని పారిపోయేవారు. అవసరానికి మాత్రం కనిపించేవారు కాదు! ఇంకా స్కూటర్లు తెలియని రోజులు.

పిలుపులు అనేవి లోకల్‌గా మా అమ్మా పెద్దమ్మా పెద్దనాన్నల పని. ప్రొద్దుటే ఇంట్లోంచి వెళితే రాత్రికొచ్చేవారు. అప్పట్లో ఇలా ఆటోల సౌకర్యం లేదు.

పెళ్ళి రేపు అనగా అంతా సత్రానికి వెళ్ళాం. పేడనీళ్ళు చల్లి ముగ్గులు పెట్టే పని అక్కయ్యలు తీసుకున్నారు. పచ్చని మామిడాకులు కట్టిన పందిరి. వెన్నెల్లో తెల్లగా మెరిసిపోయే ముగ్గులు, పందిరికి పెట్టిన రంగు రంగుల లైట్లు, పందిరి గుంజల చుట్టూ

బిలబిలలాడుతూ ఆడే పిల్లలం! ఇంక వరసైన వాళ్ళ సరసాలూ, చమత్కారాలూ, విసుర్లూ. వియ్యాల వారి పాటలూ, ఆడపెళ్ళివారి పాట్లూ సరేసరి!


ఆ రాత్రి.. పెళ్ళికూతురిని చేసిన తర్వాత మా అక్కయ్య లక్ష్మి పాటలు పాడుతుంటే (రహస్యం సినిమాలో గిరిజా కళ్యాణం మా లక్ష్మక్కా, శాంతక్కా అదరగొట్టేస్తారు!) బయట పెళ్ళికొడుకు బూట్లతో సహా అరవైమంది చెప్పులు దొంగాడు ఎత్తుకెళ్ళిపోయాడు.

అందరం పందిరి కింద కార్పెట్ మీద వరసగా పడుకున్నాం. మా రాము అన్నయ్యా, మురళి అన్నయ్యా ఇద్దరూ సాయంత్రం నుండీ వంట బ్రాహ్మడు కృష్ణమూర్తి ర్యాలీ సైకిల్ మీద కన్ను వేసారు. మర్యాదగా అడిగి చూసారు. ఇవనన్నాడు. పైగా అమ్మమ్మకి ఫిర్యాదు చేసాడు. దాంతో ఆవిడ వీళ్ళకి ప్రైవేటు చెప్పింది. "ఏరా... మీరు అందరి సైకిళ్ళూ తస్కరించి రెండో ఆట సినిమాలకెళుతున్నారా? పెళ్ళి పనులు చేస్తున్నారా?" అని. దాంతో వీళ్ళు ఇద్దరూ పథకం వేసుకున్నారు. అర్ధరాత్రి కృష్ణమూర్తి గాడిపొయ్యికి రెండు అడుగుల దూరంలో తన సంచీ తలక్రింద పెట్టుకుని నిద్రపోతుంటే ఒత్తిగిల్లించి సైకిల్ తాళం చెవి తీసుకుని జారుకున్నారు. తెల్లారి నిశ్శబ్దంగా మళ్ళీ ఆయన తల క్రింద పెట్టేద్దామని వీళ్ళ ఆలోచన! ఆ సైకిల్ తీసుకుని వెళ్ళి ఇరానీ హోటల్ ముందు స్టాండ్ వేసి వీళ్ళు టీ తాగుతుంటే ఎవడో వేసుకువెళ్ళిపోయాడు. దానికి తాళం లేదు!

ప్రొద్దుట కాఫీలూ, టిఫిన్లూ కాలే! కృష్ణమూర్తి తన బంగారం పన్ను కనిపించేటట్లు హుంకరిస్తూ శివతాండవం మొదలు పెట్టాడు "ఏ దొంగ ఎదవలు నా బుర్ర కిందున తాళం చెవి ఎత్తుకెళ్ళాపోయారో వాళ్ళ చేతులు విరిగిపోనూ!" అంటూ,

మా అన్నయ్యలిద్దరూ "తిట్టకు.. పోలీస్ రిపోర్టు ఇద్దాం..." అని శాంత పరచపోయారు."మీరేగా నిన్న నన్ను సైకిల్ అడిగారూ..." అని అనుమానంగా చూసేసరికి అక్కడి నుండి పారిపోయారు.

ఈలోగా ఆడవాళ్ళు చీరలు కట్టుకోవడం మొదలు పెట్టారు. మగవాళ్ళు ఏ తలుపు బాదినా తియ్యరు. పిల్లలు సన్నాయి వాద్యాన్ని మించి బూరల కోసం, జీళ్ళ గడియారాల కోసం ఏడ్చిన వాళ్ళు ఏడ్చినట్లున్నారు. బూరలవాడు పెళ్ళి పందిరి పీకేసే దాకా అక్కడనుండికదిలితే ఒట్టు!



పెళ్ళి చేయించే బ్రాహ్మడు..."గంధపు ఉండలు కావాలి" అనగానే, అక్కడ నిలబడి కర్ర పెత్తనం చేస్తున బాబాయి "ఒరే ఎవరక్కడా... గంధపుండలు" అంటాడు. అది విన్న పిన్ని చీర పైకి ఎగ్గట్టి "ఒసేవ్ .... ఎవరక్కడా.. గంధపుండలు కావాలి" అంటుంది. అక్కడున్న మావయ్య పక్కనున్న ఇంకో అతనితో ఆయన ఇంకో ఆవిడతో.... ఇలా చిట్ట చివరికి ఆ ప్రదక్షిణం మొదట చెప్పిన మావయ్య దగ్గరే ఆగుతుంది. అక్కడినుండి స్టోర్ రూం ఇన్‌ఛార్జి సరోజిని అమ్మమ్మ గంధపుండలు ఎర్ర డబ్బాలో పెట్టారని కాసేపూ, పసుపు డబ్బాలో పెట్టానని కాసేపూ వెతికే లోపల ఆ ఘట్టం కాస్తా అయిందనిపించి "అక్కర్లేదుట గంధపు ఉండలు" అన్న వార్త మళ్ళీ అంచెలంచెలుగా ప్రదక్షిణాలు చేసి ఆవిడ్ని చేరుతుంది. ఆవిడ 'అమ్మయ్యా' అని నడుం వాల్చేలోపల "తలంబ్రాల బియ్యం.. తలంబ్రాల బియ్యం..." అంటు మళ్ళీ కొత్తవార్త! ఇలా సరోజిని పిన్ని హడావిడి పడుతుండగా, అమ్మ బంగారం పన్ను కృష్ణమూర్తితో "పొయ్యి క్రింద అంత చింతపండు నొక్కేసావేం? వినాయకుడి లడ్డూ రుబ్బురాయంత చేసి దాచేసావేం? తెచ్చిన నిమకాయల్లో సగమే ఉప్మాలో పిండావుగా.... మిగతా సగమేవీ? నెయ్యి డబ్బా మళ్ళీ కొత్తది తెరిచావేం?" అని సి.ఐ.డీ. పనిలో బిజీగా ఉంది.

ఇక్కడ రణగొణ ధ్వనిలో పెళ్ళి జరుగుతుంటే.. ఎందుకో మగపెళ్ళివారు అలిగారు. దాంతో పెద్దమ్మా, పెద్దనాన్నా బ్రతిమాలడంలో బిజీ అయిపోయారు. ఒక తాను చింపించి కుట్టించిన లంగా జాకెట్లతో, జడ కుప్పెలతో ఇవన్నీ పట్టించుకోకుండా ఒప్పుల కుప్పలు ఆడిన వాళ్ళం ఆడినట్లే ఉన్నాం మేం.

మధ్యాహ్నానికి పెళ్ళి ఘట్టం అప్పగింతల వరకూ వచ్చింది. మొదట స్థంభానికి ఆనుకుని నిలబడ్డ మా పనిమనిషి శ్యామలమ్మతో మొదలయి, ముక్కులు ఎగబీల్చడం, కళ్ళు వత్తుకోవడం, క్రమంగా పాకి పెళ్ళి కూతురూ, ఆమె తల్లిదండ్రులూ, పిన్నులూ, మేనమామలూ, ఆమె వరసైన చెల్లెళ్ళూ, అన్నదమ్ములూ, స్నేహితురాళ్ళూ... చివరికి చుట్టూ ఉన్న అందరూ ఏడ్చే కార్యక్రమంలో పడిపోయారు. పిల్లలు సరే సరీ! అందులో కొన్నీ ఏడుపులు.. తమకి పెట్టిన చీర తక్కువనీ... ఇంకా కొన్ని ఏడుపులు తను చిన్నతనంలో ప్రేమించిన ప్రియురాలు చంకలో ఓ పిల్లాడ్నీ, వెంట ఓ పిల్లనీ ఎత్తుకుని పక్కన మొగుడితో వచ్చిందనీ.... ఎప్పుడో పోయిన అటుకుల చంద్రహారంలాంటిదే ఇంకో ఆవిడ మెడలో చూసి ఒకావిడా పెళ్ళికి పాలప్యాకెట్లు వేసిన మనిషి వరకూ అంతా ఏడ్చారు! ఇలా.... రకరకాల సందడుల మధ్య అయి గోరింటాకు పెట్టిన అరచేతుల్ని పాలల్లో ముంచి మగపెళ్ళివారు యావన్మందకీ అప్పచెప్పారు.

ఈ పెళ్ళి తంతు చూడడానికి అమెరికా నుండి ఓ ప్రత్యేక అతిథి ఆంగ్లేయురాలు మా కస్తూరిబా గాంధీ ప్రిన్సిపాల్ విద్యారాణిగారితో వచ్చింది. ఏం అర్థమయిందో కానీ ఆవిడ పరమ ఆనందంగా ఉంది!

ఇంక భోజనాల ఘట్టం.... పెళ్ళికొడుకు అపడికి నాలుగు కంపెనీల్లో ఉద్యోగాలు మారాడట. నాలుగు కంపెనీలవాళ్ళూ లంచ్ టైంకి బస్సుల్లో వచ్చేసారు.

కృష్ణమూర్తి గుండెగల మీద గుండెగలు వార్చాడు! నసపెడతాడు కానీ చెయ్యి అద్భుతం! అప్పటి దప్పళం.... వంకాయ సంతర్పణ కూరా, అరటికాయ ఆవపెట్టిన కూరా, పనసపొట్టు కూరా, దోసావకాయా, గోల్ పకోడాలూ, లడ్డూలూ, బాదుషాలూ, కాజాలూ ఇప్పటికీ మాకు గుర్తున్నాయి!

పెళ్ళి పూర్తయి అబ్బాయీ, అమ్మాయీ కర్పూరం దండలతో కూర్చుని ఉండగా సన్మాన కార్యక్రమాలు మొదలయ్యాయి! ఇదేమిటీ? అనుకుంటున్నారా? రాజమండ్రి కందుకూరి రాజ్యలక్ష్మి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మా చంద్రభాను పిన్ని ఆధ్వర్యంలో ఒకరొకరినే వేదిక మీదకి పిలిచి బజ్జీలూ, బాదుషాల దండతో ఈ కార్యక్రమం ఇలా జరిగింది...

"రైలు ఇంజన్‌లా గురకలు పెడుతూ పడుకుని, స్టోర్ రూం దరిదాపులకి ఏ దొంగాడ్నీ రానివ్వని మా సరోజని అమ్మమ్మకి...." అని ఆవిడ్ని పిలిచి దండేసాం.

"కృష్ణమూర్తి వంట బ్రాహ్మడే కాదు.. పెళ్ళి కుమారుడ్ని వెతికి తనతో పాటు సైకిల్ మీద పెళ్ళిచూపులకి తెచ్చిన పెళ్ళి పెద్దగా అతని...."

"పెళ్ళి పూర్తయ్యే వరకూ తల్లుల కుచ్చెళ్ళు లాగేస్తూ, కాళ్ళు బాదుకుంటూ ఉండకుండా, దూరంగా ఆడుకున్న పిల్లలకి..."

"అలవాటు ప్రకారం తెరసెల్లా పట్టుకుని పెళ్ళికొడుకు మొహం కనపడకుండా తన మొహం ఫోటోల్లో అడ్డుపెట్టి నిలబడ్డ పెద్ద మావయ్యకి"

"ప్లాస్టిక్ బకెట్టు రెండు రూపాయలకి కొని, పెద్ద గిఫ్ట్ ప్యాక్ చేయించి తెచ్చి అందరి దృష్టినీ ఆకర్షించిన బాబాయికి......"

"ఆపశోపాలు పడుతూ అటూ ఇటూ తిరగడం తప్ప పనీపాటా చెయ్యని పెద్ద పిన్నికి"

"అన్ని పెళ్ళిళ్ళలో పెళ్ళికూతురి జడ మాంగల్య ధారణప్పుడు ఎత్తి పట్టుకునే అత్తయ్యకి"

"విస్తరాకులు చక్కగా ఎత్తిన పని అమ్మాయిలు రంగమణీ, జయమ్మలకి...." "పని చెప్పినప్పుడలా పారిపోయి, బయట అమ్మాయిలకి బీటు కొట్టిన అన్నయ్యలకి..."

"పెళ్ళిలో చక్కగా పాటలు పాడి అందరికీ తలనెప్పి బిళ్ళలు కొనే అవసరం కలిగించిన అక్కయ్యలకి..."

"జ్యోతులు తెచ్చినప్పుడు పక్కవాళ్ళని తోసేసి రేస్‌లో ముందు నిలబడ్డ పెద్దమ్మలకి ..........."

"కాఫీలో చక్కెర నుండీ, ఉల్లిపాయ పకోడీల్లో ఉల్లిపాయ ఎక్కువైందనే వరకూ వంకలు పెట్టిన మావయ్యకి."

"కనపడ్డ ప్రతివాళ్ళనీ తన జోక్స్‌కి బలి చేసిన పరాంకుశం బాబాయ్‌కి...."

"రింగ్ లీడర్‌లా అందరినీ కమాండ్ చేస్తూ ప్రోగ్రాం దిగ్విజయం చేసిన విక్టోరియా మహారాణిలాంటి మా అమ్మమ్మకి......."

ఇలా సాగిపోయింది ఆ పెళ్ళిలో సన్మానం తంతు.

ఆ రాత్రి పెళ్ళివారు అమ్మాయిని తీసుకుని వెళ్ళాకా, ఎక్కడి వాళ్ళు అక్కడ పడి నిద్రలు పోయారు. తెల్లారి లేచి చూస్తే మిరపకాయల బస్తా మీదా ఒకరూ ... బెల్లపు అచ్చుల మీద ఒకరూ! వారం రోజులు నిద్రలేదు మరి! పెళ్ళివారమండీ అంటే ఇదేగా!